దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో పాలన

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్: దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పీలేరులోని ఎం.ఎం.ఫంక్షన్ హాలులో పీలేరు, కేవీపల్లి మండలాల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ పీలేరు ప్రాంత ప్రజలతో తనకు ముప్పై సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టో కమిటీలో తాను సభ్యుడుగా ఉన్నానని, శ్రీకాళహస్తిలో జరిగిన సమావేశంలో జగన్ మోహన్ రెడ్డికి రుణమాఫీ హామీ ప్రకటించాలని సలహా ఇవ్వగా చేయలేని హామీ ఇవ్వడం కుదరదని కరాకండిగా చెప్పారరన్నారు. అయితే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అప్పట్లో వంద పేజీల అమలుకు వీలులేని 600 హామీలు ఇచ్చారన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులు, మహిళలను మోసగించారని గుర్తుచేశారు. మాటపై నిలబడే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. 2019 ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 98.44 శాతం అమలు చేసి చూపారన్నారు. కోవిడ్ కారణంగా రెండేళ్ళు రాష్ట్ర ఆర్థికంగా నష్టపోయినా సీఎం జగన్ ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలులో ఉండటంతో మిగిలిన రాష్ట్రాల చూపు రాష్ట్రంపై పడేటట్లు చేశారన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 7లక్షల మంది కార్యకర్తలు, 1.45 కోట్ల కుటుంబాలకు చేరుకుని అభిప్రాయాలు, 1.10 కోట్ల మిస్డ్ కాల్స్ కూడా చేయడం జరిగిందని తెలిపారు. దీంతో ఓర్వలేని మాజీ సీఎం చంద్రబాబు, టీడీపీ ఉనికి కోల్పోతుందని, పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. పీలేరు నియోజకవర్గంలో మరోసారి చింతల రామచంద్రారెడ్డిని గెలిపించి, వైఎస్సార్‌సీపీ జెండా విజయకేతనం జరగాలని, ఇందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీలేరుకు చెందిన కె. చంద్రయకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 4లక్షలు, హెచ్ వెంకటలక్షుమ్మకు రూ. 2.25 లక్షల చెక్కును మంత్రి అందజేశారు.

ఎన్నికలకు సమాయాత్తం కావాలి :

మరో పది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల టైమ్స్ నౌ సర్వే ప్రకారం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 24 నుంచి 25 పార్లమెంటు స్థానాల్లో గెలుపొందుతున్నట్లు చెప్పడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం సహకారంతో 2014, 2019 ఎన్నికలలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందని, 2024 ఎన్నికలలో కూడా పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీలు సతీష్ రెడ్డి, ఈశ్వరమ్మ, పీలేరు, కేవీపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఏటీ రత్నశేఖర్ రెడ్డి, గజ్జల శృతి, ఏఎంసీ చైర్మెన్ యల్లయ్య, సర్పంచ్ హబీబ్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్ మోహన్‌రెడ్డి, మహిత, భాస్కర్‌నాయుడు, నాగరాజమ్మ, జయరామచంద్రయ్య, హుమయూన్, ఎన్వీ చలపతి, హరిత తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి గజమాలతో స్వాగతం

పీలేరు : పీలేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో గజమాలతో ఘనస్వాగతం పలికారు. అలాగే మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ కొత్తపేటలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో మంత్రి, ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. బాలంవారిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, బి.డి. మహేష్‌రెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, హరిణి సురేష్‌రెడ్డి, షఫీ, మహితాఆనంద్, ఉదయ్, హరిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుధాన్యాల ఉత్పత్తులపై ముగిసిన శిక్షణ

కలికిరి: స్థానిక కేవీకే కార్యాలయంలో వారం రోజులుగా చిరుధాన్యాల ఉత్పత్తులపై జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు కేవీకే కో–ఆర్డినేటర్ పాండురంగ తెలిపారు. చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ, స్వయం ఉపాధి అవకాశాలు, ప్యాకింగ్, లేబులింగ్, మార్కెటింగ్, సర్టిఫికేషన్ విధానం, చిరుధాన్యాలలో పోషక విలువల ప్రాముఖ్యత తదితరాలపై వారం రోజుల పాటు మహిళలకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన సాధించడానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ 5వ తరగతి ప్రవేశ పరీక్ష మదనపల్లె పట్టణంలో శనివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ,బీ రెండు సెంటర్లలో, హోప్ మున్సిపల్ పాఠశాలల్లో నవోదయ ప్రవేశ పరీక్షలు జరిగాయి. మూడు కేంద్రాల్లో 664 మంది విద్యార్థులకు గాను 606 మంది హాజరయ్యారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని మదనపల్లె డీవైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు

తంబళ్లపల్లె: మండలంలో శనివారం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు నవోదయ విద్యాలయం సెంట్రల్ అబ్జర్వర్ బిందు, ఎంఈవో త్యాగరాజు తెలిపారు. తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, గుర్రంకొండ మండలాలలోని విద్యార్థులకు తంబళ్లపల్లెలో 2 పరీక్ష కేంద్రాల ద్వారా పరీక్ష నిర్వహించారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో కొత్తగా వేసిన జగనన్న గృహాల లేఅవుట్‌ను ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, హౌసింగ్ డీఈ శ్రీహరి, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీటీసీ కేశవ్ శనివారం పరిశీలించారు. ఇళ్ళ స్థలాలు లేనివారికి నిర్మాణాలు చేపట్టేందుకు లేఅవుట్‌లో మౌలిక వసతులు సమకూర్చి స్థలాలు కేటాయిస్తామని హౌసింగ్ అధికారులు పేర్కొన్నారు.

బాలయ్య సేవలు ప్రశంసనీయం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలోని చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్‌గా బాలయ్య అందించిన సేవలు ప్రశంసనీయమని బ్యాంక్ ఏజీఎం సోమశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బాలయ్య పదవీ విరమణ సందర్భంగా దుశ్శాలువతో సన్మానించి, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, వెంకటశివా రెడ్డి, కమలాకర్ రెడ్డి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ సహకార సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన

మదనపల్లె : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సీటీఎం క్రాస్ రోడ్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏపీడబ్ల్యూజే స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండ్లపల్లె అక్కులప్ప, బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్, అఖిల భారత గాండ్ల, తెలికల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లె వెంకటరమణలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 142 మందికి ఉచితంగా గుండె సంబంధిత ఈసీజీ, ఏకో, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి గుండె సంబంధిత జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ చేశారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

మదనపల్లె : ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు క్షేత్రస్థాయిలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నియోజకవర్గంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, సూపర్‌వైజర్స్, బీఎల్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో క్లయిమ్స్, అభ్యంతరాల కింద ఫారం 6,7,8 ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బీఎల్వో రిజిస్టర్స్ ఆరు అన్నెక్సర్స్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో నిమ్మనపల్లె తహసీల్దార్ సీఆర్.మంజుల, ఎంపీడీఓ లీలా మాధవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారు

మదనపల్లె సిటీ: శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక దేవళంవీధిలోని ఆలయంలో శనివారం ఉదయం అభిషేకం, కలశస్థాపన, హోమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అర్చకులు ధ్వజారోహణం చేశారు. దీంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం స్థానిక రెడ్డప్పనాయుడుకాలనీ, బ్యాంకు కాలనీ,గొల్లపల్లి ప్రాంత వాసులు ఉభయదారులుగా వ్యవహరించి సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఈశ్వరమ్మకాలనీ వాసులు ఉభయదారులుగా వ్యవహరించి స్వామిని చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో విహరించారు.రెడ్డప్పనాయుడుకాలనీలో సూర్యప్రభ వాహనంపై ఉన్న స్వామిని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా దర్శించుకున్నారు.

సేవా దృక్పథంతో సేవలు

మదనపల్లె సిటీ: వెలుగు ప్రత్యేక పాఠశాల సేవా దృక్పథంతో సేవలు అందిస్తోందని మదనపల్లె డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. శనివారం అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ రమణరావు, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వాల్మీకిపురం: మండలంలోని అయ్యవారిపల్లిలో ఖరీఫ్‌సాగుకు సంబంధించి రైతులకు శనివారం క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో 30 రకాల ధాన్యాలు సాగు చేయడం వలన భూసారం పెంపొందుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ అధికారి పెద్ద రెడ్డెయ్య అన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి పెద్ద రెడ్డెయ్య మాట్లాడుతూ ఎకరం పొలంలో వివిధ రకాల ధాన్యాలను సాగు చేయడం వలన నిత్యం ఆదాయంతో పాటు అధిక దిగుబడులు సాధించడంతో పాటు భూసారం పెంచుకోవచ్చునని సూచించారు. ప్రకృతిసాగు వలన రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు పెట్టుబడులు తగ్గించుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి సిబ్బంది హేమలత, హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై నమ్మకానికి ఇదే నిదర్శనం

- మెగా పీపుల్‌సర్వేలో విశేష స్పందన
- జిల్లాలో మదనపల్లెకు మొదటిస్థానం
- మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా


పీపుల్ సర్వే వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మెగా పీపుల్స్ సర్వేలో కోటి 45లక్షల కుటుంబాలకు కోటి 10 లక్షల మిస్డ్ కాల్స్ రావడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ఓ సైనికుడిలా ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో అన్నమయ్యజిల్లాలో మదనపల్లెను ప్రథమస్థానంలో నిలపడంపై కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలో 97,111 ఇళ్లు ఉంటే వాటిలో 88,210 ఇళ్లకు వెళ్లి ప్రజలను కలుసుకున్నామని స్పష్టం చేశారు. వీటిలో ప్రభుత్వ పాలనను సమర్థిస్తూ 72,843 మిస్డ్‌కాల్స్ వచ్చాయన్నారు. 90 శాతం మంది ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రతి ఇంటా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకుంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి రావాలని కలలు కంటున్న చంద్రబాబులా గాలిలో లెక్కలు చెప్పడం కాకుండా మెగా పీపుల్స్ సర్వేలో క్షేత్రస్థాయిలో వచ్చిన ఫలితాలే ప్రజలు ప్రభుత్వంపై చూపుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంతో వైఎస్సార్ సీపీ చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో రామసముద్రం జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, నిమ్మనపల్లె,రామసముద్రం సింగిల్ విండో ప్రెసిడెంట్‌లు రెడ్డిశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్.ఐ.రమణారెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, వెలుగుచంద్ర, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, బాలగంగాధరరెడ్డి, కత్తిరాజా, నారాయణస్వామి, బావాజాన్, సచివాలయ కన్వీనర్‌లు పోతబోలునాగరాజ, మునిశేఖర్, రామ్మోహన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను రాయితీకి ప్రత్యేక కౌంటర్లు

మదనపల్లె : 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీస్థలాల పన్నులను చెల్లించి 5 శాతం రిబేట్ పొందేందుకు ఆదివారం చివరిరోజు కావడంతో వసూళ్లకు మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలోని స్పెషల్ కౌంటర్లలో తమ అసెస్‌మెంట్లకు సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించవచ్చన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు:ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తండా సమీపంలో సారా 680 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెద్దతిప్పసముద్రం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదివారం పీటీఎంకు విచ్చేస్తారని ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నాయకులు విజయవంతం చేయాలని వారు కోరారు.

వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు


పట్టణ సమస్యలను చైర్‌పర్సన్ మనూజారెడ్డికి వివరిస్తున్న వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె : వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటిసరఫరాను మెరుగుపరుస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 18 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో.. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 18.55కోట్లు పన్ను వసూళ్లు చేయడంపై మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్ మనూజారెడ్డితో పాటుగా కౌన్సిల్ సభ్యులందరూ అభినందించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ..పట్టణంలో నిర్మిస్తున్న నాలుగు అర్బన్‌హెల్త్ సెంటర్లకు సంబంధించి ఎస్టిమేట్ మొత్తానికి అదనంగా మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి నిధుల మంజూరుకు, తిరిగి చెల్లింపుకు సంబంధించి నేషనల్ హెల్త్ మిషన్ నుంచి ఉత్తర్వులపై కౌన్సిల్‌కు తెలపాల్సిందిగా కోరారు. పట్టణ సుందరీకరణ పనులకు మున్సిపల్ నిధులతో పాటుగా పీకేఎం–ఉడా నిధులను వినియోగించాలన్నారు. వైస్‌చైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ సైదాపేటలో డ్రైనేజీ సమస్య తీర్చినందుకు ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 23వవార్డు కౌన్సిలర్ గిరిజా మాట్లాడుతూ..తమ వార్డు ఒకచోట ఉంటే..సచివాలయం మరోచోట ఉందని, ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్చాలని కోరారు. డ్రైనేజీ సమస్యపై ఏడాదిగా ప్రస్తావిస్తున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఆర్వో పల్లవి, డీఈ బండపల్లిశిరీషా, ఏఈ స్నేహప్రియ, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.




'జగనన్నే మా భవిష్యత్తుకు' అపూర్వ స్పందన

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


జేసీఎస్ ఇన్‌చార్జిలు, నాయకులతో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన జేసీఎస్ ఇన్‌చార్జీలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ, ప్రజల స్పందన, మద్దతుపై సమీక్షించారు. ఇళ్లవద్దకు వెళ్లినప్పుడు కుటుంబాల నుంచి లభించిన ఆదరణను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంతో వైఎస్సార్‌సీపీకి ఊహించని విధంగా మద్దతు లభించిందన్నారు. ఇలాంటి కార్యక్రమం గతంలో ఎప్పుడూ నిర్వహించలేదని, ప్రజల వద్దకే వెళ్లి వారి మద్దతు కోరడం రాజకీయాల్లో కొత్త అధ్యాయమని అన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు తమ ఇంటి గోడలపై జగన్ స్టిక్కర్లను అంటించుకున్నారని అన్నారు. ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో ప్రజలే చెబుతున్నారని అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. తారురోడ్ల నిర్మాణంలో తంబళ్లపల్లె మొదటిస్థానంలో ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, విద్య, వైద్యం అభివృద్ధికి, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జ్‌లు నేరేళ్ల రెడ్డిహరి, డ్రిప్ రమణ, జి.రవీంద్రరెడ్డి, ఈ.సురేష్‌రెడ్డి, ఆర్‌సీ.ఈశ్వర్‌రెడ్డి, పెద్దిరెడ్డెప్పరెడ్డి, డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీ సిద్ధార్థ' ప్రభంజనం


ఉత్తమ ర్యాంకర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మదనపల్లె : దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్–2023 సెషన్–2కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసిన ఫలితాల్లో పట్టణంలోని శ్రీ వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల సత్తా చాటుకుంది. కళాశాలకు చెందిన విద్యార్థులు ఎస్.మహమ్మద్ షాకీబ్ 98.5739, ఈ.రిషికేష్‌రెడ్డి 95.97, సీ.ఎస్.మక్బూల్ అహ్మద్ 92.99 శాతాలతో అన్నమయ్యజిల్లాలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. అలాగే వీరితోపాటుగా వివిధ కేటగిరీలో 37 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్(ఐఐటీ)కి అర్హత సాధించారు. ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి, ఏఓ ఈ.హేమంత్ విద్యార్థులను అభినందించారు.

ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితుల కాలనీకి ఓకే

కురబలకోట: మండలంలోని ముదివేడు రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు పునరావాసం కల్పనలో భాగంగా ఆర్ అండ్ ఆర్ కాలనీకి అవసరమైన భూములు ఇవ్వడానికి సంబంధిత రైతులు అంగీకారం తెలిపారు. మండలంలోని కడప క్రాస్ సమీపంలో ఎంబిజీ లే అవుట్ హైవే పక్కన 40 ఎకరాలకు పైగా భూమి ఇవ్వడానికి రైతులు అంగీకరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. పునరావాసం కల్పించడం కోసం తమ భూములు ఇవ్వడానికి సంపూర్ణ అంగీకారం తెలుపుతూ రెవెన్యూ రికార్డులలో సంతకాలు కూడా చేశారు.

